క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



పలమనేరు: పట్టణంలోని సత్యగంగమ్మ ఆలయానికి రూ.1.12లక్షలు ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి మునిశేఖర్ తెలిపారు. సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. సిబ్బంది, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

సేవాగుణం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న నాగరాజు

కుప్పం రూరల్: విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండాలని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. సోమవారం చందం పంచాయతీలో ఇంజినీరింగ్ విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వారం పాటు తమ విద్యార్థులు గ్రామంలోనే ఉంటారని, ప్రజలకు ఆరోగ్యం, పారిశుద్ధ్యం ఇతరత్రా విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే మొక్కలు నాటుతారని చెప్పారు. సర్పంచ్ కుమార స్వామి, కళాశాల సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధార్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసచార్యులు ధ్వజారోహణ పూజలు చేశారు. శ్రీవారి మూలవిరాట్ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పులిచెర్లలో అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా సోమవారం పులిచెర్లలో సిబ్బందితో ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీన సమస్యలు అధిగమించి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. సూపర్‌వైజరు రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..



బైరెడ్డిపల్లె: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటే రక్తహీనత సమస్యలు అధిగమించి ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారని సీడీపీఓ మాధవీలత అన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం బైరెడ్డిపల్లె 2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులకు పోషకాహారం, తల్లిపాలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్ ఓ అనురాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు కామాక్షి, మంగమ్మ పాల్గొన్నారు.

సరిహద్దులో పక్కాగా నిఘా

గుడిపాల: ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల్లో పక్కాగా నిఘా నిర్వహించాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అన్నారు.మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడంతో సోమవారం రాత్రి నంగమంగళం, గొల్లమడుగు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, సరిహద్దుల్లో నిఘా పటిష్టంగా నిర్వహించాలన్నారు. తమిళనాడులో ఏప్రిల్ 19న, ఆంధ్రలో మే 13న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి మరింత పరుగు

- సెజ్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- నైపుణ్యాల పెంపునకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్



కుప్పం రూరల్: వడ్డిపల్లె మహిళలతో మాట్లాడుతున్న భరత్



శాంతిపురం: దండికుప్పంలో కరపత్ర ప్రచారం చేస్తున్న భరత్

కుప్పం రూరల్/శాంతిపురం: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం కల్పిస్తే కుప్పం నియోజకవర్గం అభివృద్ధిని మరింత పరుగులు తీయిస్తానని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన కుప్పం మున్సిపాలిటీలోని వడ్డిపల్లె, అలాగే శాంతిపురం మండలం దండికుప్పంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామస్తులతో మాట్లాడారు. 35 ఏళ్లుగా ఒకే వ్యక్తికి ఓట్లు వేసి గెలిపిస్తున్నారని, ఆయన హైదరాబాద్‌లో నివాసం ఉంటూ, అక్కడి నుంచే ఇక్కడ రిమోట్ నాయకులతో వ్యవహారాలు సాగిస్తున్నారని, చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం తప్పితే ఏరోజైనా గ్రామాల్లో ఇంటింటికీ వచ్చారా, ప్రజల బాగోగులు తెలుసుకున్నారా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఆ నాయకుడు కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుంచి బయటకు అడుగుపెట్టిన పాపానపోలేదని పరోక్షంగా చంద్రబాబునాయుడును విమర్శించారు. ఆ సమయంలో కుప్పం నివాసం ఉంటూ తాము వెనుకంజ వేయక, ధైర్యంగా తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలకు సేవ చేశామని గుర్తుచేశారు. అంతేకాకుండా ప్రతిపక్షనేత ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నా వివక్ష చూపకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కుప్పాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. తనకు కుప్పం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం జగనన్న కల్పించారని, తనను గెలిపిస్తే స్థానికంగా ఉండి మరెంతో అభివృద్ధి చేస్తానని, మళ్లీ జగనన్న పాలన రావడానికి, సంక్షేమ పథకాలు కొనసాగడానికి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు హామీలతో జనాన్ని మోసం చేసి, అధికారంలోకి రాగానే హామీలు అటకెక్కించే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి తథ్యమన్నారు, తనను గెలిపిస్తే ప్రభుత్వ సహకారంతో కుప్పం ప్రజలకు స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పించేందుకు సెజ్‌ను ఏర్పాటు చేయిస్తామని, అలాగే నిరుద్యోగ యువతకు నైపుణ్యం పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్ నాగరాజు, జయశంకర్, రత్న, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు వెంకటరమణ(నాను), జంగం జనార్దన్, జంగం మనోహర్‌రెడ్డి, సురేష్ బాబు పాల్గొన్నారు. మరో వైపు వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించాయి. ప్రచారంలో వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం.



ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



పాతపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి

బైరెడ్డిపల్లె: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని పాతపేట, బైరెడ్డిపల్లె, దేవదొడ్డి పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆ కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఎన్నికల నియమ నిబంధనలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, మద్యం, నగదు..ఇతరత్రా అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణమోహన్, ఎస్ఐ క్రిష్ణయ్య, పోలీసులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం వినతులు

రామకుప్పం: ఎన్నికల అనంతరం అర్హులకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. రామకుప్పంలో జగనన్న లే అవుట్‌లో ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి వినతులు అందాయని, ఎన్నికల కోడ్ అమలులో ఉందనేది ప్రజలు గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



అమ్మవారికి మొక్కుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీ మలాలమ్మ (చాముండేశ్వరి దేవి) ఆలయ పంచమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారి ప్రతిష్ఠ, అర్చన పూజ, వివిధ హోమాలు, పూజా కైంకర్యాలు, పంచామృతాభిషేకాలకు భక్తజన సందోహం నడుమ నిర్వహించారు. ఉత్సవాలకు పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త చంద్రప్ప, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, నాయకులు శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, వినోద్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించొద్దు

- రిటర్నింగ్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్ఓ మధుసూదన్‌రెడ్డి, ఏఆర్ఓ

పుంగనూరు: ఎన్నికల కోడ్‌ను వివిధ పార్టీల నాయకులు పాటించాలని, ఎవరూ ఉల్లంఘించవద్దని రిటర్నింగ్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం ఏఆర్వో నరసింహప్రసాద్ తో కలసి ఎంపీడీఓలు, తహసీల్దార్లతోపాటు రాజకీయ పార్టీల నేతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఏ స్థాయి ఉద్యోగస్తులైనా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. నియోజకవర్గంలో 262 పోలీంగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎన్నికల అధికారులను నియమించామన్నారు. ప్రచారాలు, ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏ సమస్యలు ఎదురైన తక్షణమే సి విజిల్‌కు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తే తక్షణమే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



పులిచెర్లలో ఓటు హక్కు వినియోగంపై మానవహారం

పులిచెర్ల(కల్లూరు): ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం మధుసూదన్ కోరారు. పులిచెర్లలో సోమవారం మండల సమాఖ్య మహిళలతో కలిసి ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పులిచెర్ల నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు.

మా ఆయనను గెలిపించండమ్మా!



అత్తినత్తంలో ప్రచారం చేస్తున్న దుర్గ

- భరత్ సతీమణి దుర్గ ప్రచారం

గుడుపల్లె: ''కుప్పంలోనే ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్నాం..అందరికీ అందుబాటులో ఉంటున్నాం..తన దృష్టికి వచ్చిన సమస్యల్ని చాలావరకు ఆయన పరిష్కరించారు..అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించారు..ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని మా ఆయన్ను ఈసారి గెలిపించండమ్మా..మీకు మరెంతో సేవ చేసే అవకాశం ఇవ్వండమ్మా..''అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణ దుర్గ అభ్యర్థించారు. సోమవారం ఆమె మండలంలోని అత్తినత్తంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

నాయకుల ప్రచారం

మండలంలోని సోడిగానిపల్లె, కోటచెంబగిరి, సంగనపల్లె, చీకటిపల్లె తదితర గ్రామాలలో పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు క్రిష్ణమూర్తి, కన్వీనర్ రామక్రిష్ణ, సర్పంచ్ దేవరాజులు, రామమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు



రొంపిచెర్ల: పరీక్షలు రాని వస్తున్న విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్షలకు మొత్తం 284 మంది విద్యార్థులకు 279 మంది హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు. సదుం, చెరుకువారిపల్లె, బూరగమంద, పాలమంద, ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక ప్రైవేటు పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఎస్ఐ మారుతి పరిశీలించారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ సిద్ధ రామయ్య తెలిపారు. మొత్తం 361 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా, మంగళంపేట సెంటర్‌లో ఇద్దరు, కల్లూరు సెంటర్‌లో 9మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: పదవ తరగతి పరీక్షలు రొంపిచెర్లలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలలో 304 మంది విద్యార్థులకుగాను 294 మంది హాజరయ్యారని డిపార్టుమెంట్ అధికారులు వెంకటరమణారెడ్డి, మంజువాణి తెలిపారు. ఎస్ఐ సుకుమార్ ఆ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జెరాక్స్ సెంటర్లను మూయించారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 1334మంది విద్యార్థులకు గాను 1309 హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో వి ద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించినట్టు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో పది పబ్లిక్ పరీక్షలకు ఏర్పాటు చేసిన 5 కేంద్రాల్లో 734 మంది విద్యార్థులకు గాను 722 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ గోపాల్‌రెడ్డి తెలిపారు.



పలమనేరు: హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

27 మంది గైర్హాజరు

బైరెడ్డిపల్లె: మండలంలోని బైరెడ్డిపల్లె బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కమ్మనపల్లె మోడల్‌స్కూల్‌లో సోమవారం నిర్వహించిన 10వ తరగతి పరీక్షలకు 645 మంది విద్యార్థులకు గాను 618 మంది హాజరైనట్లు ఎంఈఓ సాయిలీల తెలిపారు. మొదటి రోజు ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: టెన్త్ పరీక్షలకు మొత్తం 725 మంది విద్యార్థులకుగాను 704 మంది హాజరయ్యారని, 21 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓలు మహబూబ్‌బాషా, నారాయణ తెలిపారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1,099 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయాల్సి ఉండగా 1076 మంది హాజరయ్యారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో ఏ,బి సెంటర్లు, బాలిక ఉన్నత పాఠశాల, ఇన్‌ఫాంట్, మండలంలోని గోనుమాకులపల్లె, కుంబార్లపల్లె జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



పుంగనూరు: మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటరెడ్డి యాదవ్, భాస్కర్‌రెడ్డి



చౌడేపల్లెలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిని గెలిపిద్దాం

పుంగనూరు: సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము కోరారు. సోమవారం ఉబేదుల్లా కాంపౌండులో సంతలో ఆయన కరపత్ర ప్రచారం చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. అలాగే గోకుల్ సర్కిల్, చంద్రకాంత వీధి, రాగానిపల్లె రోడ్డులో తన అనుచరులతో మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, నక్కబండలో కౌన్సిలర్ మనోహర్, పట్టణ మైనారిటీ సెల్ కార్యదర్శి ఖాదర్‌బాషా, ఏటిగడ్డపాళ్యంలో బలిజ సంఘ పట్టణ నాయకురాలు కొండవీటి మాధురి, కొండవీటి నరేష్, అలాగే ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు నరసింహులు, అర్షద్‌అలి, జయభారతి, మమత, రేష్మా, జేపీ యాదవ్, సాజిదాబేగం, శోభారాణి ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు మహబూబ్‌బాషా, రమణ, లక్ష్మణరాజు, మురళి, జావీద్ పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల ర్యాలీతో ప్రచారం

పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డితో కలసి సోమవారం మోటారుసైకిల్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం చేశారు. బోడేవారిపల్లె, ఈడిగపల్లె, చంద్రమాకులపల్లె, నల్లగుట్లపల్లె, పాళ్యంపల్లె, జెడితాండ, ఊటూరు గ్రామాల్లో ర్యాలీ చేశారు. ప్రతి గ్రామ కూడలిలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ర్యాలీలో సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయనారాయణరెడ్డి పాల్గొన్నారు.

23 పల్లెల్లో బైక్ ర్యాలీ

చౌడేపల్లె: మండల కేంద్రంతోపాటు మరో 23 గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ప్రజాప్రతినిధులు, నేతలతో కలిసి మోటార్ సైకిళ్ల ర్యాలీతో ఎన్నికల ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మళ్లీ ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా పీవీ మిథున్‌రెడ్డిలను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, బోయకొండ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డి ప్రకాష్, నేతలు మిద్దింటి కిషోర్‌బాబు, నాగభూషణరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, అల్తాఫ్, మంజునాథ్, లడ్డూ రమణ, అండే రాజన్న, మహమ్మద్ షఫీ,ఆనందాచార్యులు, హరీష్, పవన్, రాంకీ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు సంతలో ప్రచారం చేస్తున్న అమ్ము



పుంగనూరు: ఏటిగడ్డపాళ్యంలో ప్రచారం చేస్తున్న బలిజ సంఘ నేతలు



పుంగనూరు: నక్కబండలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ మనోహర్, ఖాదర్‌బాషా

ఈరోజు

మోటార్ సైకిళ్ల ర్యాలీతో ప్రచారం

సదుం: మండలంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న మోటార్ సైకిళ్ల ఎన్నికల ప్రచార ర్యాలీని పాలమందలో ఉదయం 8 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. పాలమంద నుంచి ర్యాలీ 79–ఏ చింతమాకులపల్లె, చింతలవారిపల్లె, ఊటుపల్లె, కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె, రెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెం పంచాయతీలలో కొనసాగుతుందని చెప్పారు. ర్యాలీని మండల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.